


గురువారం ఓటు వేసేందుకు క్యూలో నిలబడిన ఓటర్లు

| సంగారెడ్డి జిల్లాలో పోలింగ్ సరళి | | | |
|---|---|---|---|
| నియోజకవర్గం | మొత్తం ఓట్లు | పోలైన ఓట్లు | పోలింగ్‌శాతం |
| నారాయణఖేడ్ | 231188 | 192418 | 83.23 |
| అందోల్ | 249248 | 211364 | 84.80 |
| జహీరాబాద్ | 270785 | 207748 | 76.72 |
| సంగారెడ్డి | 245253 | 184974 | 75.42 |
| పటాన్‌చెరు | 397237 | 276510 | 69.61 |
| మొత్తం | 1393711 | 1073014 | 76.99 |

# తగ్గిన ఓటింగ్

| సంగారెడ్డి జిల్లాలో పోలింగ్ శాతం | | |
|---|---|---|
| నియోజకవర్గం | 2018 | 2023 |
| నారాయణఖేడ్ | 89.27 | 83.23 |
| అందోల్ | 89.28 | 84.80 |
| జహీరాబాద్ | 81.35 | 76.72 |
| సంగారెడ్డి | 82.83 | 75.42 |
| పటాన్‌చెరు | 75.97 | 69.61 |

- 2018లో సంగారెడ్డి జిల్లాలో 81.96 శాతం పోలింగ్ నమోదు
- 2023లో జిల్లాలో 76.99 శాతం పోలింగ్
- గతేడాదితో పోలిస్తే 4.97 శాతం తగ్గిన పోలింగ్ శాతం
- అందోలు నియోజకవర్గంలో అత్యధికంగా 84.80 శాతం
- పటాన్‌చెరులో అత్యల్పంగా 69.61 శాతం ఓటింగ్ నమోదు
- జిల్లాలో 13,93,711 మంది ఓటర్లు
- ఓటేసిన 10,73,014 మంది
- ఓటింగ్‌లో ముందున్న పురుషులు
- పురుషుల పోలింగ్ 77.74 శాతం
- మహిళల పోలింగ్ 76.23 శాతం
- పోలింగ్ శాతం తగ్గడం బీఆర్ఎస్‌కు అనుకూలిస్తుందంటున్న రాజకీయ విశ్లేషకులు

సంగారెడ్డి, డిసెంబర్ 1 (నమస్తే తెలంగాణ): సంగారెడ్డి జిల్లాలో గత ఎన్నికలతో పోలిస్తే ప్రస్తుత అసెంబ్లీ ఎన్నికల్లో పోలింగ్ శాతం తగ్గింది. 2018 సాధారణ ఎన్నికల్లో సంగారెడ్డి జిల్లాలోని ఐదు నియోజకవర్గాల్లో 81.96 శాతం పోలింగ్ నమోదు కాగా, గురువారం జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో సంగారెడ్డి జిల్లాలో 76.99 శాతం నమోదైంది. గతం కన్నా ఈసారి 4.97 శాతం పోలింగ్ తగ్గింది. సంగారెడ్డి జిల్లాలోని అందోలు, సంగారెడ్డి, పటాన్‌చెరు, జహీరాబాద్, నారాయణఖేడ్ నియోజకవర్గాల్లో మొత్తం 102 మంది ఎన్నికల బరిలో నిలిచారు. ఆయా స్థానాలకు గురువారం ఉదయం 7గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు 1609 పోలింగ్ కేంద్రాల్లో పోలింగ్ నిర్వహించారు. పలుచోట్ల ఈవీఎంల మొరాయింపు, 5 గంటలు దాటిన తర్వాత కూడా ఓటర్లు క్యూలైన్లలో ఉండటంతో రాత్రి 7గంటల వరకు పోలింగ్ కొనసాగుతూనే ఉండడంతో అధికారులు పోలింగ్ శాతం చెప్పలేకపోయారు. శుక్రవారం ఉదయం ఎన్నికల అధికారులు పోలింగ్ వివరాలను వెల్లడించారు. పోలింగ్ శాతం తగ్గటం అధికార బీఆర్ఎస్ పార్టీకి అనుకూలిస్తుందని రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు. ఇదిలా ఉండగా, బీఆర్ఎస్ నుంచి చింతా ప్రభాకర్ (సంగారెడ్డి), చంటి క్రాంతికిరణ్ (అందోలు), మహిపాల్‌రెడ్డి (పటాన్‌చెరు), మాణిక్‌రావు (జహీరాబాద్), భూపాల్‌రెడ్డి (నారాయణఖేడ్) ఎమ్మెల్యేగా పోటీ చేశారు.

### అందోలులో అత్యధికంగా పోలింగ్ శాతం నమోదు

జిల్లాలోని ఐదు అసెంబ్లీ స్థానాలకు జరిగిన ఎన్నికల్లో 76.99 శాతం ఓటింగ్ నమోదైంది. అత్యధికంగా అందోలు నియోజకవర్గంలో పోలింగ్ శాతం నమోదైంది. గత అసెంబ్లీ ఎన్నికలతో పోలిస్తే జిల్లాలో ఈ దఫా ఎన్నికల్లో పోలింగ్ శాతం తగ్గింది. మొత్తం ఐదు నియోజకవర్గాల్లో 13,93,711 మంది ఓటర్లు ఉండగా, 1073014 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. అందోలు నియోజకవర్గంలో 84.80 శాతం ఓటింగ్ నమోదైనట్లు అధికారులు తెలిపారు. ఇక్కడ మొత్తం 249248 ఓటర్లు ఉండగా, 211364 మంది ఓటర్లు ఓటు హక్కు వినియోగించుకున్నారు. నారాయణఖేడ్ అసెంబ్లీలో 231188 మంది ఓటర్లు ఉండగా, 192418 మంది ఓటర్లు ఓటు వేయగా, 83.23 శాతం పోలింగ్ నమోదైంది. జహీరాబాద్ నియోజకవర్గంలో 270785 మంది ఓటర్లకుగాను, 207748 మంది ఓటు వేయగా, 76.72 శాతం ఓటింగ్ నమోదైంది. సంగారెడ్డి అసెంబ్లీలో 245253 మంది ఓటర్లు ఉండగా, 184974 మంది ఓటు హక్కు వినియోగించుకోగా, 75.42 శాతం ఓటింగ్ నమోదైంది. పటాన్‌చెరు నియోజకవర్గంలో 397237 మంది ఓటర్లు ఉండగా, 276510 మంది ఓటర్లు ఓటు హక్కు వినియోగించుకోగా, 69.61 శాతం ఓటింగ్ నమోదైంది. నారాయణఖేడ్ మండలం మనూరు మండలం ఇస్లాంపూర్ 94 శాతం, నారాయణ పట్టణంలోని నెహ్రూ నగర్‌లో అత్యల్పంగా 52.75 శాతం ఓటింగ్ నమోదైంది.

| పురుషులు, మహిళల పోలింగ్ సరళి | | | | |
|---|---|---|---|---|
| నియోజకవర్గం | పురుషులు | మహిళలు | పోలైన పురుషుల ఓట్లు | పోలైన మహిళల ఓట్లు |
| నారాయణఖేడ్ | 116581 | 114599 | 98805 | 93610 |
| అందోలు | 122699 | 126543 | 105722 | 105642 |
| జహీరాబాద్ | 136523 | 134259 | 106445 | 101302 |
| సంగారెడ్డి | 121636 | 123582 | 92892 | 92065 |
| పటాన్‌చెరు | 205045 | 192116 | 142254 | 134220 |
| మొత్తం | 702484 | 691099 | 546118 | 526839 |

### ఓటింగ్‌లో ముందున్న పురుషులు

సంగారెడ్డి జిల్లాలో పురుషులు ఎక్కువగా ఓటింగ్‌లో పాల్గొన్నారు. జిల్లాలోని ఐదు అసెంబ్లీ నియోజకవర్గాల్లో పురుషులు పోలింగ్ శాతం 77.74 శాతం ఉండగా, మహిళల పోలింగ్ శాతం 76.23 శాతం నమోదైంది. ఐదు అసెంబ్లీస్థానాల్లో మొత్తం 1393711 మంది ఓటర్లు ఉండగా, 1073014 మంది ఓట్లు హక్కు వినియోగించుకున్నారు. ఐదు అసెంబ్లీల్లో పురుష ఓటర్లు మొత్తం 702484 మంది ఉండగా, 546118 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. 691099 మంది మహిళా ఓటర్లు ఉండగా, 526839 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. పురుష ఓటర్లలో పటాన్‌చెరు నియోజకవర్గంలో అత్యధికంగా 14225 మంది ఓట్లు వేశారు. మహిళా ఓటర్లు సైతం పటాన్‌చెరు నియోజకవర్గంలో అత్యధికంగా 134220 మంది ఓట్లు వేశారు.



# నిఘా నీడలో స్ట్రాంగ్‌రూం

- గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయంలో ఈవీఎంలను భద్రపర్చిన అధికారులు
- నిక్షిప్తమైన ఐదు నియోజకవర్గాల భవితవ్యం
- స్ట్రాంగ్ రూంల వద్ద ప్రత్యేక బలగాల పహారా
- చుట్టూ సీసీ కెమెరాల ఏర్పాటు
- స్ట్రాంగ్‌రూమ్ భద్రతను పరిశీలించిన కలెక్టర్



ఎన్నికల సిబ్బందితో మాట్లాడుతున్న సంగారెడ్డి కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి శరత్

పటాన్‌చెరు, డిసెంబర్ 1: పటాన్‌చెరు మండలం రుద్రారం గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయంలో ఈవీఎంలను ఎన్నికల అధికారులు భద్రపరిచారు. గురువారం పోలింగ్ అనంతరం సంగారెడ్డి జిల్లాలోని పటాన్‌చెరు, నారాయణఖేడ్, అందోల్, జహీరాబాద్, సంగారెడ్డి నియోజకవర్గాల నుంచి ఈవీఎంలను అధికారులు రుద్రారంలోని గీతం స్ట్రాంగ్ రూంలకు తరలించారు. ఆయా ఈవీఎంలను నియోజకవర్గాలవారీగా పెద్దహాల్స్‌లో భద్రపరిచారు. స్ట్రాంగ్ రూంలను సీల్ చేశారు. వాటి ముందు ప్రత్యేక పోలీసు బలగాలతో కాపలా ఏర్పాటు చేశారు. సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి గట్టి నిఘా పెట్టారు. శుక్రవారం జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి శరత్ గీతంలో ఏర్పాటు చేసిన అన్ని నియోజకవర్గాల స్ట్రాంగ్‌రూంలను పరిశీలించారు. స్ట్రాంగ్‌రూంలకు కాపాలాగా ఉన్న భద్రత బలగాలతో మాట్లాడారు. నిబంధనల మేరకు ఎవరినీ రాకుండా చూడాలని సూచించారు. సీసీ కెమెరాలున్న స్ట్రాంగ్ రూంల వీడియోలు చూసేందుకు ప్రత్యేక తెరలను ఏర్పాటు చేశారు. సీసీ టీవీ డిస్ప్లే రూమ్‌లను ప్రత్యేకంగా ఏర్పాటు చేశారు. వాటితో పాటు మీడియాకు సమాచార కేంద్రం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా అధికారులకు కలెక్టర్ పలు సూచనలు చేశారు. ఎన్నికల సంఘం చెప్పినట్లుగా వ్యవహరించాలని ఆర్వోలకు ఆదేశించారు. ఎలాంటి సమస్యలు రాకుండా రికార్డులను మెయింటైన్ చేయాలని కోరారు. భద్రతా చర్యలు పకడ్బందీగా ఉన్నాయన్నారు. ఆదివారం ఈవీఎంలను బయటకు తీస్తారు. లెక్కింపు కూడా అదే రోజు ఉంటుంది. ఈ మేరకు అధికారులు తదుపరి కార్యాచరణను అంచల వారీగా చేస్తున్నారు.




ఈవీఎంలు భద్రపరిచిన గదుల ముందు ప్రత్యేక పోలీసుల పహారా

# పోలింగ్ పూర్తి సరళిపై సమావేశం

మెదక్, డిసెంబర్ 1 (నమస్తే తెలంగాణ): మెదక్ జిల్లాలో జరిగిన పోలింగ్ పూర్తి సరళిపై శుక్రవారం వైపీఆర్ కాలేజ్‌లోని సెమినార్‌హాల్‌లో జిల్లాలోని మెదక్, నర్సాపూర్ నియోజకవర్గాల్లోని వివిధ రాజకీయ పార్టీల నాయకుల, ఎన్నికల్లో పోటీ చేసిన అభ్యర్థులతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి జిల్లా సాధారణ పరిశీలకుడు పృథ్వీ రాజ్ బీపీ హాజరై మాట్లాడారు. మెదక్ జిల్లాలో పోలింగ్ ప్రశాంతంగా జరిగిందన్నారు. రాజకీయ పార్టీల నాయకులు, ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులకు ఈసీఐ నిబంధనలు ప్రకారం పోలింగ్‌లో ముఖ్యమైన పత్రాలు, మాక్ పోలింగ్, ఈవీఎం, వీవీ ప్యాట్‌పై పోలింగ్ కేంద్రాల్లో జరిగిన పోలింగ్ పై స్క్రూట్నీ నిర్వహించారు. పోలింగ్ ప్రశాంతంగా నిర్వహించిన ఎన్నికల అధికారులకు రాజకీయ పార్టీల నాయకులు, ఎన్నికల్లో పోటీ చేసిన అభ్యర్థులు ధన్యవాదాలు తెలిపారు. సమావేశంలో జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రాజర్షి షా, జిల్లా అదనపు కలెక్టర్లు వెంకటేశ్వర్లు, ఆర్వోలు అంబదాస్ రాజేశ్వర్, శ్రీనివాస్, సెక్టార్ అధికారులు, ఎన్నికల సిబ్బంది పాల్గొన్నారు.

### నర్సాపూర్ నియోజకవర్గ కౌంటింగ్ పరిశీలకులు దేవేంద్ర ప్రతాప్ సింగ్

2023 నియమావళి అమలులో భాగంగా కేంద్ర ఎన్నికల సంఘం నియమించిన నర్సాపూర్-37 నియోజకవర్గ కౌంటింగ్ పరిశీలకులు దేవేంద్ర ప్రతాప్‌సింగ్ శుక్రవారం జిల్లాకు చేరుకున్నారు. ఆయనకు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రాజర్షిషా కలెక్టర్ కార్యాలయంలో పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలికారు. ఆయనవెంట జిల్లా పశు వైద్యాధికారి విజయశేఖర్‌రెడ్డి ఉన్నారు.



మాట్లాడుతున్న జిల్లా సాధారణ పరిశీలకుడు పృథ్వీ రాజ్ బీపీ